

ఆర్మూర్ అభివృద్ధే లక్ష్యం

ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸



గల్ఫ్ బోరు ఏర్పాటు చేయాలి..

బడ్జెట్ సమావేశాల్లో గల్ఫ్ బోర్డుకు ప్రాధాన్యత ఇచ్చేలా జేఏసీ నాయకులు రాష్ట్ర రాజధానిలో ప్రయత్నాలు చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /22.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం 5150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుత సీజన్‌లో 5వేలకు పైగా క్యూసెక్కుల వరద రావడం ఇదే తొలిసారి. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 195 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1062.30 అడుగుల (13.48 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

గోదావరిలోకి స్వల్పంగా వరదనీరు



రెంజల్(బోధన్): ఎగువన గల మహారాష్ట్రతో పాటు స్థానికంగా సోమవారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలతో గోదావరి నదిలోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. వాగులతో పాటు మంజీర నది నుంచి వరద నీటి ప్రవాహం ప్రారంభమైంది. దీంతో కందకుర్తి త్రివేణి సంగమం వద్ద నదిలో నీరు పారుతోంది.

కేశవస్మృతి ఆలయ పనులను పరిశీలించిన ఎంపీ



రెంజల్(బోధన్): ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు కేశవ బలిరాం హెడ్గేవార్ పూర్వీకుల స్వస్థలమైన రెంజల్ మండలం కందకుర్తిలో నిర్మిస్తున్న కేశవ స్మృతి మందిరంతో పాటు స్మృతి మందిరాన్ని ఎంపీ ధర్మపురి అర్వింద్ మంగళవారం పరిశీలించారు. ఆలయ పనుల వివరాలను కేశవ స్మృతి మందిర నిర్మాణ కమిటీ కార్యదర్శి అంకం మహేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే తన వంతు సహకారం అందిస్తానని సూచించారు. అలాగే స్కంద ఆలయాల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, రాష్ట్ర నాయకుడు వడ్డి మోహన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోపికృష్ణ, మాజీ అధ్యక్షుడు సంతోష్, కందకుర్తి మాజీ ఉప సర్పంచ్ యోగేశ్, వైస్ ఎంపీపీ యోగేశ్, ఆలయ కమిటీ ప్రతినిధి గోవింద్ పాల్గొన్నారు.

కల్తీ కల్లుతో కాసుల వేట!

- ప్రమాదకర రసాయనాలతో లక్షల లీటర్ల కృత్రిమ కల్లు తయారీ
- మరోవైపు సొసైటీ సభ్యులను సైతం దగా చేస్తున్న ముగ్గురు వ్యక్తులు
- అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ నేతల పేర్లు చెప్పి పబ్బం గడుపుకుంటున్న వైనం
- ఆబ్కారీ మంత్రి, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డీజీకి సొసైటీ సభ్యుల ఫిర్యాదు
- అధికారులు పట్టించుకోకపోవడంతో నేరుగా మంత్రి దృష్టికి..
- 'సాక్షి' కథనాలు జతచేసి ఫిర్యాదు చేసిన సభ్యులు



కల్తీకల్లుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: చెట్లు లేకుండానే ప్రమాదకర రసాయనాలతో లక్షల లీటర్ల కృత్రిమ కల్లు తయారు చేస్తున్న నిజామాబాద్ గీత కార్మిక సహకార సంస్థ–3 డిపో బాధ్యులు, మరోవైపు సొసైటీలో ఉన్న సభ్యులను సైతం దోపిడీ చేస్తూ రూ. కోట్లు దండుకుంటున్నారు. విచిత్రమేమిటంటే ఇందులో కేవలం బాధ్యులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులే మొత్తం దండుకుంటుండడం గమనార్హం. గీత కార్మికులకు న్యాయంగా ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకుండా దగా చేస్తున్నారు. అన్నీ తెలిసిన ఆబ్కారీ శాఖ జిల్లా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో కొందరు సొసైటీ సభ్యులు రాష్ట్ర ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డీజీకి ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అయితే ఈ డిపో బాధ్యులు గత నవంబరు వరకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత పేరు చెప్పుకున్నారు. గత శాసనసభ ఎన్నికల ఫలితాల రోజు నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు చెప్పి పబ్బం గడుపుతూ సభ్యులందరినీ మభ్యపెట్టి ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సభ్యులు తాము చేసిన ఫిర్యాదుకు గతంలో 'సాక్షి'లో రాసిన కథనాల ప్రతులను సైతం జతచేశారు.

■ ఆబ్కారీ నిబంధనల మేరకు గీత కార్మిక సహకార సంఘం సదరు కార్మికులతో మాత్రమే నడిపించాలి. కానీ ఈ 3వ సంఘానికి మాత్రం నిబంధనలతో సంబంధం లేదనే పరిస్థితి. కేవలం ముగ్గురు వ్యక్తులే సొంత డిపోలా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వాళ్లు చెప్పిందే వేదమన్నట్లుగా నడిపిస్తున్నారు. ఈ సొసైటీలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకల గురించి ప్రశ్నించిన ఓ గీత కార్మికుడిని సంఘం నుంచి తొలగించారు. మరోవైపు తనకు రావాల్సిన డబ్బుల గురించి మాట్లాడిన సందర్భంలో తమతో సమానమైన వాటాదారుడిని(డైరెక్టర్) సైతం మధ్యంతరంగా బయటకు పంపించేశారు. ఇదిలా ఉండగా కల్లు గీత అంటే ఎలా చేయాలో తెలియని వారిని కొందరిని అక్రమ మార్గంలో సభ్యులుగా చేర్చుకున్నారు. పైగా సభ్యుల్లో కొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అయినప్పటికీ ఆబ్కారీ అధికారులు పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

■ ఈ సొసైటీలో స్థానికేతర కార్మికులు చాలా మంది ఉండగా, పలువురు డబుల్ లైసెన్సులు ఉన్నవాళ్లు సైతం ఉండడం గమనార్హం. కొందరికి ఆయా గ్రామాల్లో టీఎఫ్‌టీ లైసెన్సులు ఉన్నాయి. ఇలా గ్రామాల్లో లైసెన్సులు ఉన్న వారిలో పలువురు నిజామాబాద్ 3వ సొసైటీలో సభ్యులుగా న్నారు. ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ ఎక్సైజ్ అధికారులు తమకేమీ తెలియనట్లు నటిస్తున్నారు. అధికారులకు ఎప్పటికప్పుడు మామూళ్లు వస్తుండడంతో ఫిర్యాదులు వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదు. చిత్రమేమిటంటే గీత కార్మికుడిగా చెప్పుకుంటున్న ప్రస్తుత క్యాషియర్ కం డైరెక్టర్ ఈ సొసైటీ మంజూరైన సమయంలో విదేశాల్లో ఉన్నాడు. ఆబ్కారీ అధికారులు ముడుపులు తీసుకుని సదరు వ్యక్తికి గీత కార్మికుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించే ట్యాపింగ్ పరీక్షలో పాల్గొనకపోయినప్పటికీ సభ్యుడిగా అవకాశం కల్పించారు. మరోవైపు నిజామాబాద్ లోకల్ కాని పలువురికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి, కరీంనగర్, హైదరాబాద్, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన ఈ ముగ్గురు వ్యక్తులు తమ బంధువులను సొసైటీ–3లో సభ్యులుగా చేసుకున్నారు. ఈ వ్యవహారాలపై అనేక ఫిర్యాదులు అందినప్పటికీ ఆబ్కారీ అధికారులు మాత్రం ఈ త్రయానికి వత్తాసు పలుకు పలుకుతున్నారు.

జిల్లాలో 35.5 మి.మీ. సగటు వర్షపాతం



సుభాష్‌నగర్: జిల్లాలో సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా 35.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతంగా నమోదైంది. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు గడిచినా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఈ వర్షం ఆరుతడి పంటలతో పాటు వరి పంటకు జీవం పోసింది. అత్యధికంగా సాలూరలో 12.6 సెంటీమీటర్లు, నవీపేట్‌లో 11.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 5 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 17 మండలాల్లో సాధారణ, 11 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు జిల్లాకు మోస్తరు నుంచి భారీ వర్షసూచన ఉందని వాతావరణశాఖ ప్రకటించింది.

వర్షపాతం వివరాలు

మండలం	మి.మీ..		
		బాల్కొండ	30.0
సాలూర	126.0	నిజామాబాద్‌నార్త్	29.1
నవీపేట్	116.0	మోపాల్	29.1
మెండోరా	61.4	బోధన్	27.6
ఏర్గట్ల	61.1	పోతంగల్	25.8
నిజామాబాద్‌సౌత్	59.8	డిచ్‌పల్లి	23.8
మోర్తాడ్	55.7	వేల్పూర్	23.2
ఎడపల్లి	55.0	కోటగిరి	21.1
కమ్మర్‌పల్లి	46.8	ఆలూరు	17.3
ఇందల్వాయి	46.0	మాక్లూర్	17.3
ముప్కాల్	41.5	రుద్రూర్	16.6
రెంజల్	39.5	నందిపేట్	14.6
ధర్పల్లి	36.7	జక్రాన్‌పల్లి	14.6

డీఎస్సీ అభ్యర్థుల్లో అయోమయం!

- అస్తవ్యస్తంగా పరీక్షా కేంద్రాల కేటాయింపు
- జిల్లా అభ్యర్థులకు హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో సెంటర్లు

నిజామాబాద్ అర్బన్: డీఎస్సీ అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల కేటాయింపు అస్తవ్యస్తంగా మారింది. దీంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి నెలకొంది. డీఎస్సీ పరీక్ష ఈ నెల 18న ప్రారంభమై ఆగస్టు 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తొలిసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్షను నిర్వహించనున్నారు. జిల్లాలో 640 పోస్టులు ఉండగా సుమారు 7వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో కేవలం నగరంలోని అర్సపల్లిలో గల నాలెడ్జ్ పార్క్ స్కూల్‌లో మాత్రమే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 2,600 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. కాగా నిజామాబాద్ జిల్లాకు చెందిన అత్యధిక మంది అభ్యర్థులకు హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలో సెంటర్లు కేటాయించారు. ఈ కారణంగా అభ్యర్థులు ఇతర జిల్లాలకు వెళ్లి పరీక్ష రాయడం కష్టతరంగా మారనుంది. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించనుండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిరావడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోండి : డీఈవో

డీఎస్సీ పరీక్ష హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. హాల్ టికెట్‌తో పాటు పరీక్షా కేంద్రానికి ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు జరుగుతాయన్నారు.

పరీక్షలు వాయిదా వేయాలి



గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలు స్వల్ప కాలంలోనే ఉండడంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాక గతనెలలోని టెట్ పాసైన అభ్యర్థులు కూడా ఉన్నారు. ప్రిపరేషన్‌కు ఏ మాత్రం టైం సరిపోవడం లేదు. పరీక్షలను వాయిదా వేయాలి.

– లాల్ సింగ్, టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి

దూరప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బంది



పరీక్ష కేంద్రాలను దూరప్రాంతాల్లో కేటాయించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఉదయం 9 గంటలకే పరీక్ష ఉండడంతో అభ్యర్థులు చేరుకునేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత పద్ధతిలోనే నిర్వహిస్తే బాగుండేది.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

చెప్పింది రూ.75.. ఇచ్చింది రూ.50

- జిల్లాకు స్కూల్ యూనిఫాం నిధులు విడుదల
- 99,141 జతలు కుట్టిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు
- మిగతా డబ్బులు కూడా త్వరలో వస్తాయంటున్న అధికారులు


మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్ (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): స్కూల్ యూనిఫాంలు కుట్టిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఎట్టకేలకు కూలి డబ్బులు వచ్చాయి. జిల్లాకు రూ. 49,57,050 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కుట్టుకూలీ చార్జీలు ఒక్కో జతకు రూ. 75 ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రూ. 50 మాత్రమే విడుదల చేయడంపై ఎస్‌హెచ్‌జీ మహిళలు విచారం వ్యక్తం చేస్తున్నారు. మిగతా డబ్బులు కూడా వస్తాయని అధికారులు చెబుతున్నప్పటికీ మహిళలకు నమ్మకం ఏర్పడడం లేదు. దీంతో రెండో ఎస్‌హెచ్‌జీలతో జత యూనిఫాంలు కుట్టించే విషయంలో అధికారులకు తలనొప్పిగా మారింది. మూడు నెలల క్రితం గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గ్రామాల్లోని ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్కూల్ పిల్లల యూనిఫాంలు కుట్టించడానికి కసరత్తు ప్రారంభించారు. వారికి అవగాహన కల్పించి ముందుకు వచ్చేలా చేశారు. కుట్టుకూలీ సరిపోదంటే రూ. 75కు పెంచారు. యుద్ధప్రతిపాదికన జిల్లా వ్యాప్తంగా 2,040 మంది మహిళలను గుర్తించి వారితో యూనిఫాంలు కుట్టించారు. ఇందుకు అధికారులు కూడా తీరిక లేకుండా ఎంతో శ్రమించి నూరుశాతం యూనిఫాంలను సంబంధిత పాఠశాలలకు సరఫరా చేశారు. యూనిఫాంలు ముట్టినట్లుగా హెచ్‌ఎంలతో సంతకాలు సైతం తీసుకున్నారు. మహిళలు కుట్టుకూలీ డబ్బుల కోసం ఎదురుచూస్తుండగా వారం రోజుల క్రితం జిల్లాకు డబ్బులు విడుదలయ్యాయి. ప్రభుత్వం వీటిని డీఈవో ఖాతాలో వేయగా, డీఈవో ఖాతా నుంచి మండల సమాఖ్య ఖాతాలను బదలాయిస్తున్నారు. మండల సమాఖ్యకు వచ్చిన డబ్బులను గ్రామ సంఘాల ద్వారా యూనిఫాంలు కుట్టిన మహిళల ఖాతాలో జమ చేయనున్నారు. అయితే, పూర్తి డబ్బులు రాకముందే అధికారులు రెండో జత యూనిఫాంను ఎస్‌హెచ్‌జీలతో కుట్టించడానికి కసరత్తు మొదలు పెట్టారు. ప్రభుత్వం చెప్పినట్లుగా జతకు రూ. 75 ఇవ్వాల్సిందేనని, లేదంటే రెండో జత యూనిఫాంలు కుట్టబోమని మహిళలు ఐకేపీ అధికారులకు ఖరాఖండిగా చెబుతున్నారు. రెండో జత కుట్టిన డబ్బులతో కలిపి ప్రభుత్వం ఇస్తుందని నచ్చజెప్పినా వారు వినిపించుకోవడం లేదు. ఆగస్టు 15నాటికి రెండో జత యూనిఫాంను కుట్టి పిల్లలకు ఇవ్వాల్సి ఉంది.

ఆందోళన చెందొద్దు

మొదటి జత కుట్టిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు కుట్టుకూలీ డబ్బులు వచ్చాయి. జతకు రూ. 75 చొప్పున ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం రూ. 50 ఇచ్చింది. మిగతా డబ్బులు కూడా త్వరలోనే ప్రభుత్వం ఇస్తుంది. ఈ విషయంలో మహిళలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో, నిజామాబాద్

బదిలీల ప్రక్రియ షురూ..

- పంచాయతీరాజ్, జెడ్పీ, మున్సిపల్‌లో ట్రాన్స్‌ఫర్స్
- కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సమక్షంలో కౌన్సెలింగ్
- త్వరలోనే మిగతా శాఖలకు కూడా..


జాబితాను పరిశీలిస్తున్న ఉద్యోగులు

సుభాష్‌నగర్: జిల్లాలో సాధారణ బదిలీల ప్రక్రియ మొదలైంది. పంచాయతీరాజ్, జెడ్పీ, మున్సిపల్ శాఖలకు సంబంధించి బదిలీలు చేపట్టారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం ఆయాశాఖల జిల్లాస్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్ మంద మకరందు, జెడ్పీ సీఈవో ఉష, డీపీవో చక్రవర్తుల తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రక్రియను పూర్తి చేశారు. సీనియారిటీ జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీగా ఉన్న స్థానాల్లో వారు కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. 4 ఏళ్లు పూర్తి చేసుకున్న వారిలో 40శాతం తప్పకుండా బదిలీ కావాలనే నిబంధనను పరిగణనలోకి తీసుకున్నారు. స్పౌజ్, పదవీ విరమణకు ఏడాది గడువు, ఇతర నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియను చేపట్టారు. రాష్ట్రస్థాయి అధికారులు బదిలీ ఉత్తర్వులను త్వరలోనే ఇవ్వనున్నారు. ఈనెల 20వ తేదీలోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ సాధారణ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. బదిలీ అయిన వారు ఈనెల 21వ తేదీలోగా విధుల్లో చేరనున్నారు.

బదిలీలపై కసరత్తు..

సాధారణ బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను దృష్టిలో పెట్టుకుని మిగతా శాఖలు కూడా బదిలీపై కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే అన్నిశాఖల్లో ఆప్షన్లు పూర్తయ్యాయి. 17న మొహర్రం కారణంగా ప్రభుత్వం సెలవును ప్రకటించింది. ఈనెల 18 నుంచి అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ వేగవంతం కానుంది. 20వ తేదీలోపు బదిలీలు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బదిలీలు నిషేధమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు అన్ని శాఖలు ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేసి, అధికారిక ఉత్తర్వుల కోసం వేచిచూస్తున్నాయి.

152 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ..

- సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా 138 మంది గ్రేడ్–4 కార్యదర్శులు, గ్రేడ్–3 ఇద్దరు, గ్రేడ్–2 ఆరుగురు, గ్రేడ్–1 ఆరుగురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. అదేవిధంగా 14 మంది మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు) బదిలీ కానున్నారు.
- జెడ్పీలో 9 మంది సూపరింటెండెంట్లు, 14 మంది సీనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.
- మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్లు 14 మంది, జూనియర్ అసిస్టెంట్లు 10 మంది బదిలీ అయ్యారు.

ముదురుతున్న అటవీ భూమి పంచాయితీ

- మంచిప్ప, గుండ్యానాయక్ తండాల మధ్య..
- మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన గుండ్యా నాయక్ తండా గిరిజనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంచిప్ప తండావాసులు


అటవీభూమిలో మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్న గుండ్యానాయక్ తండావాసులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప శివారులో గల రాజుల మర్రి గుట్ట ప్రాంతంలో గల అటవీ భూమి పంచాయితీ అమ్రాబాద్‌లోని గుండ్యానాయక్ తండా, మంచిప్ప తండా గ్రామస్తుల మధ్య రోజురోజుకూ ముదురుతోంది. ఆ భూమిలో తాము సాగు చేసుకుంటామని గుండ్యానాయక్ తండావాసులు కొన్నిరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో మంచిప్ప తండావాసులు రాజులమర్రి గుట్ట వద్ద సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను సుమారు 120 మందికిపైగా వెళ్లి మంగళవారం ధ్వంసం చేశారు. దీనిపై మంచిప్ప గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూమిలో ఎవరూ సాగు చేయవద్దని, సాగు చేసిన వారిని బైండోవర్ చేస్తామని అటవీశాఖ అధికారులు గిరిజనులను హెచ్చరించారు.

పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు

మంచిప్ప శివారులోని రాజులమర్రి గుట్ట, రేనులకుంట మైసమ్మ వద్ద అటవీ భూమి విషయంలో ఇరు తండావాసుల మధ్య 10 రోజులుగా గొడవ జరుగుతోంది. ఇటీవల ఇరు గ్రామాల ప్రజలు సమావేశమై చర్చించినా కొలిక్కి రాలేదు. తండా పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు రాజీ కుదుర్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. అటవీభూమిని రక్షించాల్సిన ఫారెస్ట్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం ఆరోపణలకు తావిస్తోంది. ఇటీవల రేనులకుంట మైసమ్మ వద్ద గుండ్యానాయక్ తండా వాసులు అటవీ భూమిలో సాగు కోసం చెట్లు నరికేసిన విషయాన్ని మంచిప్ప తండావాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వారిపై కోపంతో రాజులమర్రి గుట్ట వద్ద అటవీ భూమి విషయంలో గుండ్యానాయక్ తండా వాసులు గొడవకు దిగుతున్నారు. అందులోభాగంగా మంచిప్ప తండావాసులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారు. ఇరువర్గాలను కట్టడి చేసి అటవీ భూమిని రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దిశానిర్దేశం


సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయనున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ పాల్గొన్నారు. –సుభాష్‌నగర్

రుణమాఫీకి ముహూర్తం ఖరారు

- రేపు రూ. లక్ష వరకు ఉన్న పంట రుణాల సొమ్ము ఖాతాల్లో జమ
- ఆ తర్వాత దశల వారీగా రూ. 2లక్షల వరకు మాఫీ

మోర్తాడ్(బాల్కొండ): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పంట రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు శుభవార్తను అందించింది. సోమవారం మార్గదర్శకాలు జారీ చేయగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీకి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 18న రూ. లక్ష వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని.. రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సేకరించింది.

రేషన్ కార్డు ప్రామాణికం కాదు..

రుణమాఫీ విషయంలో సోమవారం రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రభుత్వం ప్రకటించినా.. సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రకటనలో రేషన్ కార్డును కేవలం కుటుంబ సభ్యులను గుర్తించడానికే అని స్పష్టం చేశారు. రేషన్ కార్డు ప్రామాణికం కాకపోవడంతో మెజారిటీ రైతులకు రుణమాఫీ ఫలాలు దక్కనున్నాయని తెలుస్తోంది. రైతు భరోసా, రైతు బంధు మాదిరిగా చిన్న సన్న కారు రైతులకు మొదట ప్రాధాన్యం ఇచ్చినట్లే ఈ రుణమాఫీ విషయంలోను చిన్న రైతులకు మొదట ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రూ. 2లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుండగా మొదట రూ. లక్ష ఆ తర్వాత విడతల వారీగా జమ చేస్తూ వెళ్లే అవకాశం ఉంది.

సంతోషకరం



రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అతని ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. గత ప్రభుత్వం మాదిరిగా మాట తప్పకుండా ఏకకాలంలోనే రుణమాఫీ సొమ్మును రైతులకు అందించనుండడం ఎంతో సంతోషకరమైన విషయం.

– శివన్నోళ్ల శివకుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పీజీ పరీక్షలు కొనసాగుతున్నాయి. వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, న్యాయ కళాశాల పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పీజీ (ఇంటిగ్రేటెడ్) ఏపీ ఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6, 8, 10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ 6వ, ఎంబీఏ, ఎంసీఏ 1, 3వ, ఐఎంబీఏ 7, 9వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 10 మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో 2019–20 విద్యాసంవత్సరం పీజీ (ఇంటిగ్రేటెడ్) 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈ నెల 20 వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ మంగళవారం పేర్కొన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 23వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు గల్ఫ్ జేఏసీ నాయకుల కృషి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతినిధులను కలిసి విన్నపాలు


ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

మోర్తాడ్: బడ్జెట్ సమావేశాల్లో గల్ఫ్ బోర్డు ఏర్పాటు అంశానికి ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రెండు రోజులుగా రాష్ట్ర రాజధానిలో బిజీబిజీగా ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే గల్ఫ్ వలస కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా గల్ఫ్ బోర్డు లేదా ప్రవాసీ విధానం(ఎన్ఆర్ఐ పాలసీ)ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఇప్పటికే గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు తాము కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటన చేశారు. ఈ నెల 24 నుంచి బడ్జెట్ సమావేశాలు ఆరంభం కానున్నాయి. బడ్జెట్ కూర్పులో గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి రూ.500ల కోట్లు కేటాయించడం, బోర్డు ఏర్పాటుకు బిల్లు ప్రవేశపెట్టడం లాంటి కార్యాచరణను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా ప్రణాళిక అమలు చేయకపోతే ఎలాంటి ఫలితం ఉండదని జేఏసీ నాయకులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగానే సోమ, మంగళవారాల్లో అధికార, ప్రతిపక్ష నాయకులను కలిసి గల్ఫ్ బోర్డు ఏర్పాటు అంశంపై చర్చించాలని విన్నవించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు వేం నరేంధర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వెల్మ బొజ్జు, వెంకట్రాంరెడ్డి ఇతర ప్రజాప్రతినిధులను జేఏసీ నాయకులు మంద భీంరెడ్డి, దొనికెన కృష్ణ, గంగుల కమలాకర్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, తోట ధర్మేందర్ తదితరులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటే లక్ష్యంగా జేఏసీ నాయకులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తమకు ఇచ్చిన హామీలను అమలయ్యేలా కృషి చేస్తామని నాయకులు పేర్కొంటున్నారు.

ఆర్మూర్ అభివృద్ధే లక్ష్యం


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కృషి చేయాలన్నారు. రాజకీయం వేరు.. అభివృద్ధి వేరన్నారు. ఎన్నికల్లో ఎవరి పార్టీ వారిదని, కానీ అభివృద్ధి విషయంలో మనందరిది అభివృద్ధి పార్టీ అని పేర్కొన్నారు. ఎవరు కబ్జాలు, కమీషన్లు, అవీనితికి పాల్పడద్దన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి తనకు వివరించాలన్నారు. మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయానికి నూతనంగా ఏర్పాటు చేసిన ముఖద్వారాన్ని ప్రారంభించారు. అలాగే రైతు బజార్‌లో నిర్మించిన మడిగెలను పరిశీలించారు. రైతుబజార్‌లో మధ్యలో మరో రెండు షెడ్డులు నిర్మించాలని సర్వసమాజ్ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం పట్టణ శివారులో వనోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతిక్కరు మొక్కలు నాటి రానున్న తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, వైస్ చైర్మన్ షేక్‌మున్ను, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

- సాక్షి కథనానికి స్పందన



రెంజల్: ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని ఎవరైనా కబ్జాకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం 'మళ్లీ మొదటికి.. పట్టించుకోని యంత్రాంగం' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమై కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం 340 సర్వే నంబరు భూమి వద్ద తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో పాటు సిబ్బంది అక్కడికి చేరుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఖరీదైన రెవెన్యూ భూమిని కాపాడేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 340 సర్వే నంబరులో 3.30 గుంటల భూమిలో 1.30 గుంటలు కోర్టు పరిధిలో ఉందని మిగిలిన రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉందని పేర్కొన్నారు. ఈ భూమిలో కబ్జాకు ఎవరైనా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించిన 7వ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ జిల్లా, క్యూరియస్ తైక్వాండో అకాడమీకి చెందిన 38 మంది క్రీడాకారులు పీవీ, సబ్, క్యాడెట్, జూనియర్, సీనియర్ కేటగిరి (పూంసే, క్యూరోగి) విభాగాలలో పాల్గొని 10 బంగారు, 5 రజత, 8 కాంస్య, మొత్తం 23పతకాలు సాధించారని కోచ్, జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, కోశాధికారి వినోద్ మంగళవారం తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల ఆగస్టులో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని రాష్ట్ర తైక్వాండో అధ్యక్షుడు మల్క కొమురయ్య, రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి మీర్ వహజ్ అలిఖాన్ తెలిపారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పతకాలు సాధించిన క్రీడాకారులను పులువరు అభినందించారు.

ఆర్మూర్ క్రీడాకారుల ప్రతిభ

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని రాయల్ తైక్వాండో అకాడమీకి చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబడి ప్రవీణ్ మంగళవారం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించిన ఏడవ రాష్ట్ర స్థాయి పోటీల్లో అకాడమికి చెందిన 15 మంది క్రీడాకారులు సబ్ జూనియర్, క్యాడెట్ విభాగంలో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో ముగ్గురు బంగారు, నలుగురు రజత, మరో నలుగురు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు దాసరి ధృవకు ఒలింపిక్ మెంబర్ మహేశ్వర్ బ్లాక్ బెల్టును ప్రధానం చేసినట్లు తెలిపారు.

జేఈఈలో జిల్లా విద్యార్థికి ర్యాంకు

నిజామాబాద్ అర్బన్: జేఈఈ పరీక్షలో ముప్కల్ మండలం వేంపల్లికి చెందిన చరణ్‌కు ఓపెన్ కేటగిరీలో రెండో ర్యాంకు ఓబీసీ కేటగిరిలో 51 ర్యాంకు వచ్చింది. జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు విద్యార్థి చరణ్‌ను మంగళవారం సన్మానించారు. అనంతరం విద్యార్థి తండ్రి వెంకట్ నర్సయ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల రవి, సజన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో వృద్ధురాలి ఆత్మహత్య

బాన్సువాడ: అనారోగ్య సమస్యలతో పాటు జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాన్సువాడలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణానికి చెందిన రెంజర్ల గంగవ్వ(70) గూడెంగల్లీలో ఉంటున్న తన చిన్న కుమారుడు హన్మాండ్లు వద్ద ఉంటోంది. ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఉదయం ఇంటి నుంచి వెళ్లి మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా గంగవ్వ 13వ తేదీన సైతం పెద్దపూలు వాగులో ఆత్మహత్యకు యత్నించగా గమనించిన స్థానికులు కాపాడి కుటుంబీకులకు అప్పగించారు. మంగళవారం ఉదయం మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దాబాల్లో తనిఖీలు

భిక్కనూరు: మండలంలోని దాబా హోటళ్లను ఎక్సైజ్ సీఐ మధుసూదన్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం తనిఖీలు చేశారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. దాబాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యపై విచారణ



తాడ్వాయి: మండల తహసీల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్ ప్రసాద్ మృతిపై కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు మంగళవారం విచారణ చేపట్టారు. ఈనెల 12న ప్రసాద్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ వేధింపులతోనే చనిపోతున్నట్లు జేబులో సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయమై డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో విచారణ చేపట్టారు. ప్రసాద్‌కు సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. డీఎస్పీ వెంట సీఐ రామన్, తహసీల్దార్ రహిమొద్దీన్ ఉన్నారు. కాగా డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ మాత్రం రెండు రోజుల నుంచి విధులకు హాజరు కావడం గమనార్హం.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆలూరు మండల కేంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అంజమ్మ మంగళవారం తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఎస్సై, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 7గురిని పట్టుకోగా వారి నుంచి రూ.19,390 నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో సిబ్బంది లక్ష్మణ్, రాములు, అనిల్‌కుమార్, నర్సన్న పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లికి చెందిన షేక్ ఖాజా (35) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. బోధన్‌కు వెళ్తున్నానని ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లిన ఖాజా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య నస్రీన్ బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లికి చెందిన ఎం లక్ష్మణ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెగడపల్లి గ్రామానికి చెందిన ఎం లక్ష్మణ్, ఎం రవి అనే ఇద్దరు అన్నదమ్ముళ్లకు కొంతకాలం నుంచి భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో నాగస్‌పల్లికి చెందిన నరేశ్ రవి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మంగళవారం అన్న లక్ష్మణ్ పొలం కౌలుకు తీసుకున్న నరేశ్‌తో గొడవ పడి కులం పేరుతో దూషించాడు. దీంతో నరేశ్ ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆవుల చోరీకి యత్నం..

ఎడపల్లి (బోధన్): మండల కేంద్రం నుంచి ఆవులను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన వారిని సోమవారం రాత్రి స్థానిక యువకులు పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు పరారయ్యారు. గ్రామంలో దేవతల పేరుతో వదిలిన ఆవులకు మత్తుమందు ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు దుండగులు యత్నించారని ఎస్సైకి స్థానిక యువకులు ఫోన్‌లో సమాచారం అందించారు. మంగళవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్సై వంశీచందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ మూడు సార్లు ఆవులను ఎత్తుకెళ్లేందుకు దుండగులు ప్రయత్నించారని స్థానికుల ద్వారా తెలిసింది.

హెగ్డోలిలో విషాదఛాయలు



పోతంగల్(రుద్రూర్): తమపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేని యువ జంట నవీపేట్ మండలంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోతంగల్ మండలం హెగ్డోలికి చెందిన బండారి శైలజ, అనిల్‌కుమార్ దంపతులు. తమ జీవితం గూర్చి సమీప బంధువు చేస్తున్న దుష్ప్రచారంతో వివాహం జరిగి ఏడాది గడవక ముందే మనస్థాపంతో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం రాత్రి గ్రామంలో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వర్ని: మండలంలోని బెల్యా నాయక్ తండా శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలైనట్లు ఎస్సై కృష్ణకుమార్ మంగళవారం తెలిపారు. గాయపడ్డవారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని కొల్లూర్ శివారులో గుర్తు తెలియని దుండగులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి ఆయిల్, వైరు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కొల్లూర్ శివారులోని పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దొంగతనం జరిగినట్లు ట్రాన్స్‌కో అడిషనల్ ఏఈ నర్సారెడ్డి పేర్కొన్నారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఆరుగురికి తీవ్రగాయాలు
- ఆగిఉన్న లారీని కారు ఢీకొనడంతో ప్రమాదం


శివకుమార్ వర్మ (ఫైల్)


శివకుమార్ వర్మ మృతదేహం


ప్రమాదంలో గాయపడ్డ రవళి


సాయిరెడ్డి


శివకుమార్

భిక్కనూరు: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి తీవ్రగాయాలైన ఘటన మండల శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మరౌత్ శివకుమార్‌వర్మ (34) తన స్నేహితులైన నిజామాబాద్ జిల్లాకు చెందిన కన్నుల అరుణ్, చెందిన సాయిరెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బర్దలాల్ శివకుమార్‌తో కలిసి నాలుగు రోజుల క్రితం గోవా వెళ్లారు. గోవాకు వెళ్లేటప్పుడు శివకుమార్‌వర్మ తన భార్య రవళి, కుమారుడు బ్రహ్మరౌత్ శివానంద్, కుమార్తె అరణ్యలను మెడ్చల్‌లో ఉన్న తన బావమర్ది ఇంట్లో వదిలి వెళ్లాడు. తిరిగి గోవా నుంచి వచ్చిన వారు మంగళవారం ఉదయం 3 గంటలకు మెడ్చల్‌లో ఉన్న భార్య, పిల్లలను తీసుకొని నిర్మల్‌కు కారుపై బయలు దేరారు. కారు సిద్దరామేశ్వరనగర్ శివారులోకి రాగానే జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నది. కారు సగభాగం లారీ కిందికి వెళ్లిపోయింది. ఈ ఘటనలో శివకుమార్‌వర్మ అక్కడికక్కడే మృతి చెందగా భార్య రవి, పిల్లలు శివానంద్, అరణ్య, స్నేహితులు అరుణ్, శ్రీసాయిరెడ్డి, శివకుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని కారును ప్రొక్లయినర్‌తో బయటకు తీయించారు. క్షతగాత్రులను ఆసుప్రతికి తరలించారు. వైద్యుల సూచన మేరకు శివకుమార్‌ను మెరుగైన చికిత్స నిమత్తం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్లూర్ సీఎస్‌పీలో చేతివాటం

- మహిళా సంఘాల డబ్బులు స్వాహా చేసిన నిర్వాహకురాలు
- రూ. 50 లక్షలు పక్కదారి


ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్‌లో ఐకేపీ మహిళా పొదుపు సంఘాలకు సంబంధించిన సొమ్మును ఓ బ్యాంకుకు చెందిన కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకురాలు పక్కదారి పట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సుమారు రూ.50 లక్షల వరకు గల్లంతయినట్లు తెలుసుకున్న మహిళా సంఘాల సభ్యులు మంగళవారం జీపీ వద్దకు తరలివచ్చి ఆందోళన చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సీఎస్‌పీ పాయింట్ నిర్వహించే సంధ్య గతేడాది కాలంగా ఖాతాదారులకు డబ్బులు ఇవ్వడం, వారి ఖాతకు డబ్బులు జమ చేయడం లాంటి లావాదేవీలు చేస్తోంది. అయితే కొన్ని నెలలుగా మహిళా సంఘాల సభ్యులు ఇచ్చే లోన్ డబ్బులను సీఎస్‌పీ నిర్వాహకురాలు బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేయడం ప్రారంభించింది. కొన్ని సంఘాలు తీసుకున్న లోన్ క్లియర్ కావడంతో కొత్త లోన్ కావాలని ఐకేపీ కార్యాలయంలో విన్నవించుకున్నారు. బ్యాంకు స్టేట్‌మెంట్ పరిశీలించిన సిబ్బంది లోన్ డ్యూ ఉందని చెప్పడంతో సదరు మహిళా సంఘాలు కంగుతిన్నాయి. ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తున్నామని, డ్యూ ఎందుకుంటుందని బ్యాంకులో ఆరా తీశారు. సీఎస్‌పీ పాయింట్ నుంచి డబ్బులు జమ కాలేదని తెలుసుకున్న మహిళా సంఘాలు ఆందోళనకు దిగాయి. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 38 మహిళా పొదుపు సంఘాలకు చెందిన డబ్బులు గల్లంతయినట్లు ఐకేపీ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. సీఎస్‌పీ నిర్వాహకురాలి నుంచి డబ్బులు రికవరీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



బీబీపేట: ఇంట్లో ఉన్న పీటపై నుంచి పడి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని జనగామలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరె మల్లేశ్ కుమారుడు కోరె నితీశ్(6) స్థానిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 11న ఇంట్లో ఉన్న పెద్దపీటపై ఆడుకుంటూ అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు గాయమవడంతో గ్రామంలోని డాక్టర్‌కు చూయించారు. ఈ నెల 12న పాఠశాలకు వెళ్లిన నితీశ్ మధ్యాహ్నం తల నొప్పి ఉందని చెప్పి ఇంటికి రావడంతో కుటుంబీకులు కామారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. దీంతో పరిస్థితి విషమంగా ఉందని గుర్తించిన వైద్యులు హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి మరింత మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. బాలుడి తాత కోరె లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

డిచ్‌పల్లి/బాసర: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలానికి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా సకాలంలో స్పందించిన పోలీసులు ఆ మె ప్రాణాలు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన ఓ మహిళ మంగళవారం ఉదయం బంధువుల ఇంటికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. కొంత సేపటికి ఆమె తన సోదరికి ఫోన్ చేసి బతుకుపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పింది. కుటుంబీకులు వెంటనే డిచ్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. మహిళ మొబైల్ సిగ్నల్ ఆధారంగా నిర్మల్ జిల్లా బాసరలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే బాసర పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన బాసర ఎస్సై గణేశ్ మొబైల్ లోకేషన్ ఆధారంగా మహిళ వద్దకు చేరుకుని పీఎస్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మహిళను ఇంటికి తీసుకెళ్లారు.

ఖాతాదారులకు బ్యాంక్ మేనేజర్ టోకరా

- 16 మంది పేరుతో లోన్లు తీసుకొని నొక్కేసిన వైనం
- బ్యాంక్ చుట్టూ తిరుగుతున్న బాధితులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న ఓ వాణిజ్య బ్యాంకు మేనేజర్ సుమారు రూ. కోటి వరకు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శివాజీనగర్‌లోని ఓ వాణిజ్య బ్యాంక్ మేనేజర్ 16 మందికి తెలియకుండానే వారి అనుమతి తీసుకోకుండా లోన్లు ఇచ్చి వారి ఖాతాల నుంచి నేరుగా తన ఖాతాలోకి వేసుకున్నట్లు సమాచారం. ఈ 16 మందికి నెలవారీ వాయిదాలు చెల్లించాలని సెల్ ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లాయి. దీంతో లోన్లు తీసుకోకుండా సెల్ ఫోన్లకు మెసేజ్ రావడంతో 16 మంది ఖాతాదారులు అవాకయ్యారు. ఖాతాదారులు బ్యాంక్‌కు వచ్చి ఆరా తీశారు. ఇందులో కొంత మంది అప్పుగా ఇచ్చినట్లు సమాచారం. బ్యాంక్‌లో అవకతవకలపై అధికారులు ఆడిట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై పట్టణ సీఐ నరహరిని వివరణ కోరగా బ్యాంకులో అవకతవకలపై ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చిందరవందరగా పడేసిన వస్తువులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఉన్న ఓ ఇంట్లో దుండగులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇన్‌చార్జి ఎస్సై సాయన్న మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సోనార్ స్వామి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇంటికి తాళం ఉండటాన్ని గమనించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి రెండు బీరువాల్లో ఉన్న 12 తులాల వెండి నాణేలు, ఒక గ్రాము బంగారు విగ్రహం, రూ. వెయ్యి నగదును దుండగులు చోరి చేసినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీం, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి 8 నెలల జైలు

ఎడపల్లి: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ఉన్న పలు ఆలయాల్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడికి బోధన్ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి సాయిశివ 8 నెలల జైలు శిక్షను విధించినట్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదరాల రాణి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని కొండల్‌వాడి గ్రామానికి చెందిన జిత్తేవార్ గణేశ్ అలియాస్ నర్సింలు ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్‌లో ఉన్న బాల త్రిపుర సుందరి అమ్మవారు, చెరువుకట్టపై ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. ఈ విషయమై గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ ఏప్రిల్ 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. నిందితుడు నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి 8 నెలల జైలు శిక్షను విధించినట్లు పేర్కొన్నారు. కేసులో లైజన్ ఆఫీసర్ శంకర్, సాయన్నలు సహకరించారని అన్నారు.